క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 15న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ సాంబరెడ్డి తెలిపారు. సప్తగిరి కాలనీ, ఆర్టీసీ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు, రాంనగర్, నందితారే నగర్, క్రాంతినగర్, జవహర్ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

న్యూశాయంపేట: హనుమకొండ జిల్లా పరిధిలోని ములుగురోడ్డు వద్ద గల బాలుర మైనారిటీ గురుకులంలో ఖాళీగా ఉన్న డాటా ఎంట్రీ ఆపరేటర్ (ఔట్‌సోర్సింగ్) పోస్టుకు (1) అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సనా సెక్యూరిటీ అండ్ ప్లేస్‌మెంట్ ఏజెన్సీ నిర్వాహకుడు హుస్సేన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు 83176 47072 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

కేయూలో మరొకరికి కారుణ్య నియామకం



కేయూ క్యాంపస్: కాకతీయ యూనవర్సిటీలో ఉద్యోగి గాదె ఎల్లస్వామి మరణించటంతో ఆయన కుమారుడు గాదె దివాకర్‌కు కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇస్తూ కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేష్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు దివాకర్‌కు యూనివర్సిటీలో గురువారం అందజేశారు. ఈనెల 13న ఇద్దరికి కారుణ్య నియామక ఉత్తర్వులు అందించిన విషయం తెలిసిందే.

విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ



హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం నాగారంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం స్వయం పాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయుల వేషధారణలో సహ విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులు తమ ఒకరోజు అనుభవాన్ని వ్యక్త పరిచారు. కార్యక్రమంలో హెచ్ఎం వాసంతి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షురాలిగా తేళ్ల సుగుణ



హన్మకొండ: మహిళా కాంగ్రెస్ 59వ డివిజన్ అధ్యక్షురాలిగా తేళ్ల సుగుణను నియమించినట్లు మహిళా కాంగ్రెస్ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు బంక సరళదేవి తెలిపారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి నుంచి సుగుణ తన నియామక పత్రాన్ని గురువారం అందుకున్నారు.

'భద్రకాళి'ని దర్శించుకున్న కడియం కావ్య

హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయాన్ని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య గురువారం సందర్శించి పూజలు నిర్వహించారు. ఈమేరకు ఆమెకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు అందించి, మహాదాశీర్వచనం అందజేశారు.

ఎంపీ టికెట్ మహిళలకే ఇవ్వాలి

నయీంనగర్: కాంగ్రెస్ పార్టీ వరంగల్ పార్లమెంట్ టికెట్ మహిళలకే కేటాయించాలని టీఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు బొట్ల భిక్షపతి డిమాండ్ చేశారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అన్ని రంగాల్లో మహిళలను ప్రోత్సహిస్తున్న తరుణంలో మహిళలకే టికెట్ కేటాయించి వారి పట్ల తమ చిత్తశుద్ధిని చాటుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు ముద్దంగి రఘు, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ కార్యదర్శిపై చర్య తీసుకోవాలి

వరంగల్ క్రైం: దళిత అధికారిని కులం పేరుతో దూషించిన ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి భాష బోయిన సంతోష్‌పై వెంటనే చర్య తీసుకోవాలని దళిత బహుజన విద్యార్థి ఉద్యమ సంఘాల నాయకులు కోరారు. ఈమేరకు హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డికి గురువారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.20 వేలు ఇవ్వాలని భీమారంలోని ప్రభుత్వ బీసీ బాలికల కళాశాల హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ రేణిగుంట్ల ప్రియాంకను డిమాండ్ చేయగా, డబ్బులు ఇవ్వకపోవడంతో కులం పేరుతో ఆమెను దూషించిన సంతోష్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సుకుమార్, టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కన్నం సునీల్, ఎంఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ వడ్డెపల్లి మధు, డీఎంఎస్ఏ జిల్లా కన్వీనర్ రేణుకుంట్ల ఠాగూర్, టీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మణితేజ, తదితరులు పాల్గొన్నారు.

కంకరతో కష్టాలు

- ప్రారంభించి ఏడాదైనా పూర్తికాని రోడ్డు పనులు
- పత్తాలేని కాంట్రాక్టర్
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు




కంకర పోసి వదిలిపెట్టిన యాదవనగర్ - వంగపహాడ్ రోడ్డు

హసన్‌పర్తి: యాదవనగర్ నుంచి వంగపహాడ్ రోడ్డు అధ్వానంగా తయారైంది. ఆ రోడ్డులో ప్రయాణం భారంగా మారింది. కార్పొరేషన్ నుంచి సుమారు రూ.8కోట్ల వ్యయంతో రోడ్డు నిర్మాణ పనులను ఏడాది క్రితం చేపట్టారు. రోడ్డు నిర్మాణం కోసం కంకర పోసి వదిలేశారు. అప్పటినుంచి ఆ రోడ్డు వైపు సదరు కాంట్రాక్టర్ కన్నెత్తి కూడా చూడడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

భయంభయంగా ప్రయాణం

ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే వాహనదారులు, ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. వంగపహాడ్, బైరాన్‌పల్లి, అర్వపల్లి, సిద్ధాపురం, మల్లారెడ్డిపల్లి, బుచ్చయ్యపల్లి, కంఠాత్మకూర్, రామకృష్ణాపురం గ్రామాలకు ఈ మార్గంలోనే వెళ్తుంటారు. నిత్యం ఈ మార్గంలో వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే ఏడాది కాలంగా ప్రయాణికులకు కష్టాలు ఎక్కువయ్యాయి. కంకరతో వాహనాలు దెబ్బతింటున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఫోన్ చేసినా స్పందన కరువు

పనుల విషయమై సదరు కాంట్రాక్టర్‌ను ఫోన్ చేసినా స్పందించడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులకు ఫోన్ చేసినా స్పందన లేదని చెబుతున్నారు. రోడ్డు అసంపూర్తిగా ఉండడంతో అధిక వ్యయప్రయాసాలు పడాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు. బాటసారులు ఆ దారిలో నడిచేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే నాగరాజు స్పందించి రోడ్డు నిర్మాణ పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

మోదీ విధానాలతో రైతులకు నష్టం



నిరసన తెలుపుతున్న రైతు సంఘాల నాయకులు

వరంగల్ చౌరస్తా: ప్రధాని మోదీ ప్రభుత్వ వినాశకర విధానాలతో దేశ వ్యవసాయ రంగం దివాలా తీస్తోందని, రైతాంగం సంక్షోభంలోకి నెట్టివేయబడుతోందని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) రాష్ట్ర కన్వీనర్ పెద్దారపు రమేష్ ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రజా, కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఎస్‌కేఎం ఆధ్వర్యంలో వరంగల్ రైల్వే స్టేషన్ నుంచి రైతు కార్మిక సంఘాల నాయకులు గురువారం ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌కేఎం జిల్లా కన్వీనర్ కుటుంబ బాబురావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పెద్దారపు రమేష్, రాష్ట్ర నాయకులు గోనె కుమారస్వామి వీరగోని శంకరయ్య చంద్రన్న రాచర్ల బాలరాజు ఓదెల రాజన్న మాట్లాడుతూ ఢిల్లీ సరిహద్దుల్లో రైతాంగం చేస్తున్న ప్రజాస్వామ్య ఉద్యమంపై నిర్బంధం ప్రయోగించి రైతుల ప్రాణాలను బలికొంటూ వారి హక్కులకు కేంద్రం భంగం కలిగిస్తోందని వాపోయారు. కార్యక్రమంలో నాయకులు చిర్ర సూరి నర్రప్రతాప్, గన్నారపు రమేష్, గంగుల దయాకర్, పుల్ల రమేష్, చుక్క మొగిలి, మంద రవి, మహమ్మద్ బషీర్, కుమారస్వామి, రాజు, పసునూటి రాజు, అంశాలు రెడ్డి, సంపత్, మోహన్ రావు, సాయిలు, పాషా, అశోక్, గోవర్ధన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధికి కృషి



హన్మకొండ: మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని

హన్మకొండ: వరంగల్ పశ్చిమ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. 57వ డివిజన్ హనుమకొండ గాంధీనగర్‌లో రూ.7 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను గురువారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పాటైందని వివరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఇంజనీర్ నల్ల సుధాకర్ రెడ్డి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బంక సరళ, కాంగ్రెస్ హనుమకొండ బ్లాక్ అధ్యక్షుడు బంక సంపత్ యాదవ్, డివిజన్ అధ్యక్షుడు బంక సతీష్‌యాదవ్, గాంధీనగర్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చెరుకు వెంకట రాజిరెడ్డి, మందల కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

హన్మకొండ చౌరస్తా: 10వ డివిజన్, పద్మాక్షికాలనీలోని వడ్డెరకాలనీకి చెందిన సుమారు 200ల మంది బీఆర్ఎస్ కార్యకర్తలు స్థానిక నేత బొంత రామకృష్ణ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈమేరకు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి గురువారం ఆహ్వానించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లు, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కుమార్, మాజీ కార్పొరేటర్లు తాడిశెట్టి విద్యాసాగర్, నసీం జహాన్ పాల్గొన్నారు.అలాగే, హనుమకొండలోని 8, 9, 10వ డివిజన్లలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్పొరేటర్లు పోతుల శ్రీమన్నారాయణ, చీకటి శారద, నాయకులు పాల్గొన్నారు.

రాజకీయ సన్యాసం తీసుకోవాలి

నయీంనగర్: బహుజనులను వంచించి మోసపూరిత రాజకీయాలు చేస్తున్న ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ రాజకీయ సన్యాసం తీసుకోవాలని ధర్మ సమాజ్ పార్టీ హనుమకొండ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో డీఎస్‌పీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మంద రమేష్ మాట్లాడుతూ డీఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహరాజ్‌పై ఆర్ఎస్‌పీ చేసిన వ్యాఖ్యలను హనుమకొండ జిల్లా డీఎస్‌పీ కమిటీ తీవ్రస్థాయిలో ఖండించిందన్నారు. మనువాదుల పార్టీ అయిన బీఆర్ఎస్‌తో ఆర్ఎస్‌పీ - బీఎస్‌పీ పొత్తుపెట్టుకొని రాష్ట్ర బహుజనులను పూర్తిగా వంచించాయని వాపోయారు. కాన్షీరాం పని విధానంలో ధర్మసమాజ్ పార్టీ మాత్రమే ఈ రాష్ట్రంలో పనిచేస్తోందని చెప్పారు. నాయకులు సాయిబాబా, రూప, రాజేష్, పాల్గొన్నారు.

పెచ్చులూడుతున్న భవనాలు

కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో వివిధ తరగతి గదుల్లోకి స్లాబులు పెచ్చులూడుతున్నాయి. ఈమేరకు కేయూ అభివృద్ధి అధికారి ప్రొఫెసర్ వాసుదేవ రెడ్డి, ఇంజనీర్లు రామయ్య, భవానీప్రసాద్, తదితరులు కళాశాలను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా వాసుదేవరెడ్డి మాట్లాడుతూ వర్షపు నీరు భవనంపై నిలవడంతో స్లాబ్‌లు పెచ్చులూడుతున్నాయని చెప్పారు. మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి, వైస్ ప్రిన్సిపాల్ పుల్లా శ్రీనివాస్ ఉన్నారు.

సామాజిక సేవకు ఖర్చు చేయాలి

హసన్‌పర్తి: తాము సంపాదించిన దాంట్లో కొంత మొత్తాన్ని సామాజిక సేవ కోసం ఖర్చు చేయాలని పీవీ ఫౌండేషన్ చైర్మన్ ప్రభాకర్‌రావు సూచించారు. సాయిని సమావేశం మందిరంలో పెండెం రమేష్‌బాబు అధ్యక్షతన లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్-320 ప్రాంతీయ సమావేశం బుధవారం రాత్రి జరిగింది. ఈ సందర్భంగా ప్రభాకర్‌రావు మాట్లాడుతూ సమాజ అభివృద్ధికి స్వతహాగా పాటుపడే వారిని ప్రజలు గుండెకు హత్తుకుంటారని అన్నారు. బలగం ఫేం, మైమ్ కళాకారుడు మధు మాట్లాడుతూ వరంగల్ జర్నలిస్టులు, చిన్ననాటి గురువులు తనకు చేయూతనందించారని గుర్తుచేశారు. జిల్లా గవర్నర్ వెంకటేశ్వర్ రావు, మాజీ గవర్నర్లు డాక్టర్ సుధాకర్‌రెడ్డి, కన్న పరశురాములు, గోపాల్ రెడ్డి, లక్ష్మీ నరసింహారావు, రాజిరెడ్డి, లవకుమార్ రెడ్డి, పొట్లపల్లి శ్రీనివాస్‌రావు, వీడీజీలు వెంకట్ రెడ్డి, చంద్రశేఖర్, మదన్‌మోహన్ పాల్గొన్నారు.

వినియోగదారుల చట్టం అమలుకు కృషి



సదస్సులో మాట్లాడుతున్న దామోదర్

హన్మకొండ: దక్షిణాది రాష్ట్రాల్లో వినియోగదారుల రక్షణ చట్టం సక్రమంగా అమలు చేయడానికి కృషి చేస్తామని దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సంఘాల సమన్వయ సమితి అధ్యకుడు డాక్టర్ పల్లెపాడు దామోదర్ అన్నారు. ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని హనుమకొండ రాంనగర్‌లో జిల్లా వినియోగదారుల సలహా సంఘం ఆధ్వర్యంలో గురువారం వినియోగదారుల చైతన్య సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దక్షిణాది రాష్ట్రాల్లో స్థానిక ప్రభుత్వాల సహకారంతో టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. ప్రతి రాష్ట్రంలో కార్యాలయాలు ఏర్పాటు చేసి నష్టపోయిన వినియోగదారులకు న్యాయపరమైన సలహాలు, సూచనలు ఇవ్వడంతో పాటు చట్టం గురించి పూర్తి సమాచారం అందిస్తామన్నారు. సృష్టికి ప్రతి సృష్టి చేస్తున్న కృత్రిమ మేధస్సు విప్లవాత్మక పరిణామని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా వినియోగదారుల సలహా సంఘం సభ్యులు కవి రాజ్, ఇందిరా, సతీష్, జ్యోత్స్న, రవీందర్, మంజుల, న్యాయవాదులు మల్యాల మనోహర్ రావు, సీహెచ్.హైమావతి, వినియోగదారులు పాల్గొన్నారు.

ఈద్గా, మసీదును మోడల్‌గా తీర్చిదిద్దుతాం



సమావేశంలో మాట్లాడుతున్న జబ్బార్

ఖిలా వరంగల్: మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా షరీఫ్ సహకారంతో ఖిలా వరంగల్ ఈద్గా, మసీదును మోడల్‌గా తీర్చిదిద్దుతామని ఈద్గా అధ్యక్షుడు ఎంఏ.జబ్బార్, మసీదు అధ్యక్షుడు సయ్యద్ రబ్బానీ అన్నారు. వరంగల్ ఫోర్ట్‌రోడ్డుపై ఖిలా వరంగల్ ఈద్గా, మసీదు ప్రాంగణంలో ప్రధాన కార్యదర్శి చాంద్‌పాషా, కోశాధికారి సయ్యద్ మోయిజ్ అధ్యక్షతన ఈద్గా మసీదు కార్యవర్గ సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా ప్రశాంతమైన వాతావరణంలో రంజాన్ ఉపవాస దీక్షలు, ఇఫ్తార్ పార్టీలు, రంజాన్ ప్రార్థనలను నిర్వహించుకుందామని అన్నారు. సమావేశంలో కార్యవర్గ ప్రతినిధులు సయ్యద్ ఇబ్రహీం, శౌకత్, సయ్యద్ ఆల్తఫ్, ఎండీ.అఫ్జద్, ఎండీ.అష్రఫ్, ఎండీ.సల్లాయొద్దీన్, ఎండీ.అంకూస్, మహ్మద్ మగ్దుం, మాషూక్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై నిఘా



కేంద్ర బలగాలతో కలిసి కవాతు చేస్తున్న ఏసీపీ

ఖిలా వరంగల్: సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, రానున్న సార్వత్రిక ఎన్నిలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి పోలీసు వ్యవస్థ పటిష్ట భద్రతా చర్యలు తీసుకుంటోందని వరంగల్ ఏసీపీ నందిరామ్ నాయక్ తెలిపారు. వరంగల్ రైల్వేగేట్ అండర్ బ్రిడ్జి నుంచి ఆర్టీఏ జంక్షన్, రంగశాయిపేట నుంచి ఉర్సు కరీమాబాద్ మీదుగా రైల్వేగేట్ వరకు మిల్స్‌కాలనీ పోలీసులు, స్పెషల్ పోలీసుల ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ మల్లయ్య నేతృత్వంలో గురువారం సాయంత్రం కవాతు నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మిల్స్‌కాలనీ ఏరియాలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేక బలగాలు కవాతు నిర్వహించినట్లు ఏసీపీ చెప్పారు. కార్యక్రమంలో ఎస్సై గోవర్ధన్, కేంద్ర బలగాలు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



రామన్నపేట: పరీక్ష కిట్ అందజేస్తున్న పోలీసులు



పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేస్తున్న శ్రీకాంత్

రామన్నపేట: మట్టెవాడ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లు, స్కేల్‌తో కూడిన కిట్‌ను మట్టెవాడ ఏసీపీ నందిరాంనాయక్ ఆధ్వర్యంలో మట్టెవాడ పోలీసులు అందించారు. పదవ తరగతి పరీక్షలను పురస్కరించుకుని సీపీ అంబర్ కిషోర్‌ఝా ఆదేశాల మేరకు గురువారం నిర్వహించిన కార్యక్రమంలో మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ గోపి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దర్గా ప్రభుత్వ పాఠశాలలో..

కాజీపేట రూరల్: కాజీపేట దర్గా ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులను తెలంగాణ జాగృతి విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు పి.శ్రీకాంత్‌చారి గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం స్వామి, పూర్వ విద్యార్థులు సతీష్, శివ, రాకేష్‌యదవ్, రాజేష్, రాజు, రాజేందర్, పల్సాన్ పాల్గొన్నారు.

కిడ్నీలను నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ప్రమాదం



కేక్ కట్ చేస్తున్న నెఫ్రాలజిస్ట్ మల్లేశ్వర్

కాశిబుగ్గ: మానవ శరీరంలో అతి ముఖ్యమైన అవయవం కిడ్నీలను నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని సంరక్ష ఆస్పత్రి సీనియర్ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ బొట్టు మల్లేశ్వర్ తెలిపారు. ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని పురస్కరించుకుని వరంగల్ సంరక్ష సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో వేడుకలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న జీవన విధానం, ఆహారపు అలవాట్లతో ప్రజలు అనేక అనారోగ్య సమస్యలు గురవుతున్నారని చెప్పారు. పౌష్టికాహారం, నీరు ఎక్కువగా తాగడం, ధూమపానం, మద్యానికి దూరంగా ఉంటూ క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తే కిడ్నీ సమస్యలకు దూరంగా ఉండవచ్చని వివరించారు. ఆస్పత్రి వైస్ చైర్మన్ డాక్టర్ తిరుపతిరెడ్డి, ఎండీ డాక్టర్ శ్రావణ్‌కుమార్, డాక్టర్ అజిత్ మహమ్మద్, డైరెక్టర్లు డాక్టర్ పోలా నటరాజ్, డాక్టర్ లక్ష్మీదీపక్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ శ్రావ్య రెడ్డి, సరిత, సాయి, జ్యోతి పాల్గొన్నారు.

మెదడువాపు వ్యాధితో జాగ్రత్త



మాట్లాడుతున్న వరుణ్‌రెడ్డి

నయీంనగర్: మెదడువాపు వ్యాధి ప్రబలుతోందని, ఈక్రమంలో లక్షణాలు కనిపించిన వెంటనే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని న్యూరాలజిస్ట్ డాక్టర్ జి.వరుణ్‌రెడ్డి తెలిపారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మెదడువాపు వ్యాధికి సరైన వైద్యం అందించకపోతే ప్రాణానికే ప్రమాదమన్నారు. తలనొప్పి, మెడ నొప్పి, మెడ కొయ్యబారడం, కాంతిని సహించలేక పోవడం, సరిగా ఆలోచించలేక పోవడం, మాట్లాడలేక పోవడం, విచిత్రంగా ప్రవర్తించడం లాంటివి మెదడువాపు వ్యాధిసోకిన వారిలో కనిపించే లక్షణాలని వివరించారు. కార్యక్రమంలో మేనేజర్లు శ్రీనివాస్ చిదుర, అశోక్ కుమార్, వాసుకిరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీలో ధిక్కార స్వరం

- కడియం కావ్య ఎంపీ అభ్యర్థిత్వంపై ఉద్యమకారుల మండిపాటు



సమావేశమైన ఉద్యమకారులు

హన్మకొండ: వరంగల్ లోక్‌సభ అభ్యర్థి ప్రకటనపై బీఆర్ఎస్‌లో ధిక్కార స్వరం బయటకు వచ్చింది. తాము పార్టీ ఆవిర్భావం నుంచి పని చేస్తున్నా, ఉద్యమంలో కీలకంగా పాల్గొని కేసులు పాలై, జైలు జీవితం గడిపినా తమకు సరైన గుర్తింపు లభించడం లేదని ఉద్యమకారులు వాపోయారు. ఈమేరకు హనుమకొండ సుబేదారిలో బీఆర్ఎస్ నాయకులు, ఉద్యమకారులు, ఆశావహులు చింతల యాదగిరి, బోడ డిన్న, జోరిక రమేష్, బండి రజినికుమార్, బొల్లికొండ వీరేందర్, బుద్దె వెంకన్న, పోలపల్లి రామ్మూర్తి గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీలో సభ్యత్వం లేని కడియం కావ్యకు బీఆర్ఎస్ వరంగల్ ఎంపీ అభ్యర్థిగా ఎలా ప్రకటిస్తారని ప్రశ్నించారు. ఈనెల 13న హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశానికి తమను ఎమ్మెల్సీ కడియం శ్రీహరి ఆహ్వానించకుండా అవమానించాడని వాపోయారు. ఎమ్మెల్సీ కడియం శ్రీహరి బ్లాక్ మెయిల్ రాజకీయాలకు బీఆర్ఎస్ అధిష్టానం తలొగ్గి ఏకపక్ష నిర్ణయం తీసుకుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పునరాలోచించాలని కోరారు. లేకుంటే రెండు మూడు రోజుల్లో కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు.

రేపు డప్పు కళాకారుడి సంస్మరణ సభ

హన్మకొండ: జన నాట్యమండలి డప్పు కళాకారుడు డప్పు రమేష్ ద్వితీయ సంస్మరణ సభను ఈనెల 16న ఉదయం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నట్లు తెలంగాణ ప్రజాఫ్రంట్ నాయకుడు జనగాం కుమారస్వామి తెలిపారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద సంస్మరణ సభ వాల్‌పోస్టర్లను ప్రజా సంఘాల నాయకులు గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ భూపాల్ అధ్యక్షతన జరగనున్న సభలో సినీ దర్శకుడు నరసింహారావు, విప్లవ రచయితల సంఘం నాయకుడు ప్రొఫెసర్ కాసీం, సామాజిక రచయిత అనురాధ, మాభూమి సంధ్య పాల్గొంటారని వివరించారు.

సంక్షిప్తంగా

కాకతీయ టెక్స్‌టైల్స్, వీవర్స్ వెల్ఫేర్ సహకార సంఘం ఎన్నికలు నిర్వహించాలి

హన్మకొండ: కాకతీయ టెక్స్‌టైల్స్ అండ్ వీవర్స్ వెల్ఫేర్ పొదుపు, పరపతి పరస్పర సహాయక సంఘం ఎన్నికలు నిర్వహించాలని సంఘం సభ్యులు కోరారు. హనుమకొండ జిల్లా కార్యాలయాల సముదాయంలోని జిల్లా సహకార శాఖ కార్యాలయంలో జిల్లా సహకార అధికారి నాగేశ్వర్ రావును గురువారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హనుమకొండ జిల్లా మడికొండ శివారులో ఏర్పాటు చేసిన కాకతీయ టెక్స్‌టైల్స్ అండ్ వీవర్స్ వెల్ఫేర్ పొదుపు అండ్ పరపతి పరస్పర సహాయక సంఘం కాల పరిమితి ముగిసిందని తెలిపారు. 15ఏళ్లుగా ప్రతి ఏడాది నిర్వహించే మహాజన సభ నిర్వహించలేదని, నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకోలేదని జిల్లా సహకార అధికారికి వారు వివరించారు. కార్యక్రమంలో లక్ష్మినారాయణ, శ్రీనివాస్, రమేష్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కల్యాణ మహోత్సవం

కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య సిద్ధి, బుద్ధి సమేత గణనాథుడి నిత్య కల్యాణ మహోత్సవాన్ని గురువారం జరిపించారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు అయిన వోలు రాధాకృష్ణ శర్మ ఆధ్వర్యంలో అర్చకులు దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలకు పంచామృతాలతో పాటు సహస్రధారాలతో అభిషేకం నిర్వహించారు. ఆలయ కార్యకర్తలు వధువరూల పక్షాన నిలిచి వివాహ వేడుకలను నిర్వహించడం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

కారల్ మార్క్స్‌కు నివాళి

ఖిలా వరంగల్: ప్రపంచ మేధావి కారల్ మార్క్స్ 141వ వర్ధంతిని వరంగల్ శివనగర్ సీపీఐ తమ్మెర భవనంలో పార్టీ సహాయ కార్యదర్శి షేక్ బాషుమియా ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కారల్ మార్క్స్ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి మేకల రవి, సంగీ ఎలేందర్, ల్యాదల్ల శరత్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

మెట్ల బావి అభివృద్ధికి చర్యలు

ఖిలా వరంగల్: చారిత్రక మెట్ల బావి (రాణి రుద్రమదేవి స్నానాల బావి) అభివృద్ధికి ప్రభుత్వం ప్రభుత్వం రూ.50లక్షల నిధులు కేటాయించింది. పర్యాటక ప్రదేశాన్ని అభివృద్ధి చేయాలనే తలంపుతో మంత్రి కొండా సురేఖ ప్రత్యేక చొరవ తీసుకుని నిధులు మంజూరు చేయించారు. దాంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ మంత్రి కొండా సురేఖకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మాదిగలను అణచివేస్తున్న కేసీఆర్

రామన్నపేట: మాదిగలను రాజకీయంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అణచివేస్తున్నారని ఎమ్మార్పీఎస్ కోర్ కమిటీ సభ్యులు, దళితరత్న కేదాసి మోహన్ విమర్శించారు. నగరంలో గురువారం నిర్వహించిన ఎమ్మార్పీఎస్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మాదిగల జనాభా ప్రాతిపదికన పార్లమెంట్ నియోజకవర్గ ఎంపీ సీట్లు మాదిగలకే కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 70 లక్షల జనాభా కలిగిన మాదిగలను ఆర్థికంగా, రాజకీయంగా మోసం చేస్తున్న కేసీఆర్ ఇకనైనా తన పద్ధతి మార్చుకుని వరంగల్ ఎంపీ పార్లమెంట్ స్థానాన్ని ఎస్సీ ఉపకులాలకు కాకుండా మాదిగలకు కేటాయించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు బొట్ల రమేష్, ఎర్రోళ్ల సుదర్శన్ పాల్గొన్నారు.

కుట్టుమిషన్లు అందజేయాలి

హన్మకొండ: ముస్లిం మహిళలకు కుట్టుమిషన్లు అందించాలని బీఆర్ఎస్ మైనారిటీ నాయకుడు నయీమొద్దీన్ డిమాండ్ చేశారు. హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో మైనారిటీ ముఖ్య నాయకుల సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం కుట్టు మిషన్ల పంపిణీకి శ్రీకారం చుట్టగా ఎన్నికలు రావడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయిందని తెలిపారు. సమావేశంలో అఫ్జల్, ఇస్మాయిల్, ఖలీల్, షకీల్, తస్లిమాఖాన్, అబ్దుల్ ఖాన్, తౌసిఫ్ అహ్మద్ ఉన్నారు.

గుండెపోటుతో ఏఆర్ పీసీ మృతి

జనగామ: కలెక్టరేట్‌లోని కలెక్టర్ నివాసం వద్ద గార్డు డ్యూటీ చేస్తున్న ఏఆర్ కానిస్టేబుల్ విలసాగరం రాజు(45) గురువారం(అర్ధరాత్రి) మృతి చెందారు. ఉమ్మడి జిల్లాలోని ఆత్మకూరుకు చెందిన ఆయన ప్రస్తుతం వరంగల్ భద్రకాళీ ఆలయ పరిసర ప్రాంతాల్లో ఉంటున్నారు. గార్డు డ్యూటీ చేస్తున్న సందర్భంలో అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో గుండెపోటుకు గురి కాగా, వెంటనే హనుమకొండకు తరలిస్తుండగా.. మార్గమధ్యలో మృతిచెందారు. మృతదేహాన్ని వరంగల్‌కు తరలించారు.

అంగన్‌వాడీ మండల కమిటీ ఎన్నిక



కాజీపేట: తెలంగాణ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ కాజీపేట మండల కమిటీని సభ్యులు సోమిడి గ్రామంలో గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షురాలిగా కె.రమాదేవి, కార్యదర్శిగా ఎం.కవిత, కోశాధికారిగా పి.శారద, ఉపాధ్యక్షురాలిగా ఎం.అరుణ, సహాయ కార్యదర్శిగా డి.లలిత, శ్రీదేవి ఎంపికయ్యారు. సోమిడి సెక్టార్‌కు బాధ్యురాలిగా ఎం.కవిత, బి.బాలశ్రీ, డి.రఘుకుమారి, మడికొండ సెక్టార్‌కు పి.వెంకటలక్ష్మి, పి.శారద, కె.రాజ్యలక్ష్మి, దర్గా సెక్టర్‌కు టి.జ్ఞానసుందరి, ఎం.అరుణ, కె.రజిత ఎన్నికయ్యారు.